## నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



పంజాగుట్ట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని టీజీఎస్పీడీసీఎల్ గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్(డీఈ) జి.భీమా నాయక్ పేర్కొన్నారు. ప్రజల ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలని సిబ్బందికి సుచించామని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ఇంటర్వ్యూ

**వేసవి నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**డీఈ:** లోవోల్టేజీ సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**ఎన్ని నిధులు వెచ్చిస్తున్నారు?**

**డీఈ:** సుమారు రూ.10 కోట్ల వ్యయంతో 22 ఇంటర్ లింకింగ్ లైన్స్, మూడు ఫీడర్స్ బైఫర్‌కేషన్ లైన్స్, విద్యుత్ పంపిణీ మెరుగుదల కోసం 34 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుకు సంబంధించిన పనులు చేస్తున్నాం. అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త విద్యుత్ లైన్లు వేస్తున్నాం.

**విద్యుత్ అంతరాయం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**డీఈ:** నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఒకవేళ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం.

**సమస్య తలెత్తితే ఎవరిని సంప్రదించాలి?**

**డీఈ:** విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే సంబంధిత సిబ్బంది లేదా సబ్‌స్టేషన్ కార్యాలయానికి కాల్ చేస్తే వెంటనే పరిష్కరిస్తారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించాం. వినియోగదారుల ఫిర్యాదుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.




జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు విశాల్ సుధాం, సలీంఖాన్ తదితరులు

## తాగునీటి సమస్యలు పరిష్కరించండి

బేగంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు విశాల్ సుధాం, సలీంఖాన్ తదితరులు వాటర్ వర్క్స్ అధికారులను కలిసి విన్నవించారు. శనివారం ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సనత్‌నగర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన బేగంపేట డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో గత కొద్ది నెలలుగా తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. బేగంపేట బస్తీ, అల్లంతోట బాయి, అంబేడ్కర్‌నగర్, ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ, మాతాజీనగర్ తదితర ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తుందని, పలు బస్తీల్లో నిత్యం మురుగనీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బేగంపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జీఎం వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనీఫ్‌ఖాన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




కంటి అద్దాలను అందజేస్తున్న ఏసీపీ వెంకటరమణ, డాక్టర్ రవీంద్రగౌడ్

## ఉచిత వైద్య సేవలు అభినందనీయం

బేగంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు చేయడం ద్వారా వారి జీవితాల్లో శంకర నేత్రాలయం అధినేత డా.రవీంద్ర గౌడ్ వెలుగులు నింపుతున్నారని ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. శంకర నేత్రాలయం, సంకేత స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్‌నగర్ సంయుక్తంగా శనివారం సనత్‌నగర్‌లో ఉచిత మోగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వెంకటరమణ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 3 లక్షల మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేయడం గొప్ప విషయమన్నారు. డా. రవీంద్రగౌడ్ మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకున్నామని, నియోజకవర్గంలో అంధత్వం లేకుండా చేయడమే లక్ష్యంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 700 మందికి పరీక్షలు నిర్వహించి 550 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ముగ్గురు గంజాయి వినియోగదారుల అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గంజాయి వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. లక్ష్మీనరసింహనగర్‌లో కొంత మంది గంజాయి వినియోగిస్తున్నట్లు జూబ్లీహిల్స్ పోలీసులకు సంచారం అందడంతో ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చెపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురికి పరీక్షలు చేయగా గంజాయి తాగినట్లు తేలింది. నిందితులు లక్ష్మీనరసింహనగర్‌లో ఏకే కిరాణా స్టోర్స్ నిర్వాహకుడు మొహమ్మద్ అక్రం అహ్మద్, ఆటో డ్రైవర్ మొహమ్మద్ రహీమ్ అలియాస్ దం బాబా, హోటల్ కార్మికుడు మొహమ్మద్ మజెర్ అని తేలింది.

## ఎంబీబీఎస్ సీటు పేరుతో మోసం

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ కాలేజీలో అడ్మిషన్ ఇస్తామని చెప్పి రూ.పది లక్షలు తీసుకుని మోసం చేసిన కన్సల్టెన్సీపై కేసు నమోదైంది. ఛత్తీస్‌గఢ్ రాయపూర్‌కు చెందిన సురేంద్రకుమార్ చంద్రకార్ కుమారుడు నీట్ పరీక్ష రాశాడు. బంజారాహిల్స్ కు చెందిన శ్రీ బాలాజీ కెరీర్ గైడెన్స్ పేరిట రాఘవేంద్ర శర్మ, రాకేష్ సైనీ, గిరీష్ రూపాని ఫోన్ చేసి ఛత్తీస్‌గఢ్‌లోని శ్రీ శంకరాచార్య మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తామని చెప్పారు. దీంతో సురేంద్ర, అతని కుమారుడు ఆకాష్ నగరానికి వచ్చి వారికి రూ.10 లక్షలకు డీడీ ఇచ్చారు. కొద్దిరోజులకు ఆకాష్‌కు మరో కాలేజీలో సీటు రావడంతో డబ్బు తిరిగివ్వాలని కోరారు. దీంతో వారు స్పందించడం మానేశారు. నగరానికి వచ్చిచూడగా కార్యాలయం మూసి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 10 నుంచి సైకాలజిస్ట్‌లకు శిక్షణ

ఖైరతాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ 10 నుంచి 13వ తేదీ వరకు సైకాలజిస్టులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. భారత నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని.. ప్రతిరోజూ 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉండే శిక్షణలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సైకాలజిస్ట్‌లు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9533660938 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## హోటల్ గదిలో యువకుడి ఆత్మహత్య

బోరబండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హోటల్ గదిలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సాయికుమార్ (28) శుక్రవారం పనిపై హైదరాబాద్‌కు వచ్చి ఎర్రగడ్డలోని ఓ హోటల్‌లో దిగాడు. రాత్రి నుంచి తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన హోటల్ యాజమాన్యం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి గదిని పరిశీలించగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి ఆత్మహత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 20 నెలలు.. నలుగురు సీఐలు

బోరబండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని రెండేళ్ల క్రితం వెస్ట్ జోన్ పరిధిలో నూతనంగా బోరబండ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్ పరిధిలో మాస్ జనాభా అధికంగా ఉంటుంది. దీంతో రోజువారీ కేసులు ఎక్కువగానే ఉంటాయి. ఇలాంటి పరిస్థితిలో శాంతిభద్రతలను కాపాడటంలో కొందరి అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. కేవలం ఏడాదిన్నర కాలంలో నలుగురు ఎస్‌హెచ్‌ఓలు మారడం ఇందుకు నిదర్శనమని ప్రజలు అంటున్నారు. ప్రథమ, ద్వితీయ శ్రేణి అధికారుల మధ్య అంతర్గత కలహాలు ఎక్కువగా ఉండటంతోనే ఈ బదిలీలకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే జరుగుతున్నాయని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారుల తీరు ఇష్టానుసారంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. స్టేషన్‌లో ఇప్పటి వరకు పని చేసిన సీఐల్లో కె.రవికుమార్ కేవలం మూడు నెలలు మాత్రమే ఇక్కడ పని చేయగా, ఎస్.విజయ్ నాలుగు నెలలు విధులు నిర్వహించారు. కె.ఆదిరెడ్డి నెల రోజులు పనిచేయగా.. ఎస్వీ శేఖర్ ఏడాది పనిచేసి ఇటీవల చార్మినార్ ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు.




బోరబండ పోలీస్ స్టేషన్

## పేదల ఆకలి తీర్చడం గొప్ప విషయం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అన్నదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడం గొప్ప కార్యమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్‌నగర్ లోని మోడల్ కాలనీలో మానవ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించే ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి ముగిసే వరకు ప్రతి రోజు 300 మందికి భోజనం, మజ్జిగ అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బాల్ రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ బుచ్చిబాబు, సభ్యులు రవీంద్రబాబు, శశికాంత్, మాచారావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అమీర్‌పేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ ఎస్ఆర్టీ 1 నుంచి 50 వరకు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, రవీంద్రనగర్ కాలనీలో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాజిల్, ఏఈ జమీల్ పాషా, రవీంద్రనగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# షియా ముస్లింలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

- హిదాయత్ అలీ మీర్జా



సమావేశంలో మాట్లాడుతున్న హిదాయత్ అలీ మీర్జా

పంజాగుట్ట,మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన షియా ముస్లింలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ జాతీయ అధ్యక్షుడు, డైరెక్టర్ హిదాయత్ అలీ మీర్జా డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో షియా ముస్లింలు సుమారు 12 లక్షల వరకు ఉన్నారని, తమ సామాజిక వర్గం నుంచి రాజకీయంగా ఎలాంటి ప్రాతినిధ్యం లేకపోవడంతో తమ వానిని చట్టసభల్లో వినిపించలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్లతో ఒక వర్గానికి చెందినవారే లబ్ధిపొందుతున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే షియా ముస్లింలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని.. ఆ హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తమ విజ్ఞప్తిని పరిశీలించాలని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ హైదర్, ఉపాధ్యక్షుడు అబిద్ హుస్సేన్ సయ్యద్(అబ్బాస్), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షబ్బీర్ హసన్ ఖాన్, ఉపాధ్యక్షులు సయ్యద్ అస్గర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న రేడియంట్ పాఠశాల విద్యార్థి షేక్ ముదాసిర్

## సైన్స్ ఫెయిర్‌లో రేడియంట్ స్కూల్ విద్యార్థికి అవార్డు

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో ఎల్లారెడ్డిగూడకు చెందిన రేడియంట్ పాఠశాలకు కన్సలేషన్ బహుమతి లభించింది. వివిధ పాఠశాలల నుంచి 150 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. రేడియంట్ విద్యార్థి షేక్ ముదాసిర్ రూపొందించిన ప్రాజెక్టుకు కన్సలేషన్ బహుమతి లభించింది. అలాగే రాష్ట్రపతి నిలయంలో జరిగిన ప్రదర్శనకు వివిధ పాఠశాలలు రూపొందించిన 300 ప్రాజెక్టుల్లో రేడియంట్ స్కూల్‌కు చెందిన సబ్రినాఫలక్ రూపొందించిన ప్రాజెక్ట్ ఎంపికైంది. వీరిని పాఠశాల సిబ్బంది అభినందించారు.



స్థానికులతో మాట్లాడుతున్న శేషుకుమారి

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

అమీర్‌పేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బీకేగూడ మసీద్ బస్తీవాసుల సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో పరిష్కరిస్తానని మాజీ కార్పొరేటర్ శేషుకుమారి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం బస్తీ వాసుల అభ్యర్థన మేరకు ఇక్కడ పర్యటించిన ఆమె వీధి లైట్లు, శానిటేషన్, నీటి సమస్యను గుర్తించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు ఖాద్రీ, అంజాద్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, హన్మంతరావు, కూతురు నర్సింహ పాల్గొన్నారు.

## నగలు కనిపించడం లేదని ఫిర్యాదు

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న నగలు మాయమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిలింనగర్ దుర్గాభవాని నగర్‌లో నివసించే పెర్నటాలు హౌస్ కీపింగ్‌గా పనిచేస్తుంది. గత నెలలో శుభకార్యానికి వెళ్లి బంగారు మాటీలు, గొలుసు, బ్రేస్‌లెట్ అల్మారాలో పెట్టింది. ఈ క్రమంలో నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## వాటర్‌బోర్డు డైరెక్టర్ స్వామి ఉద్యోగ విరమణ



స్వామిని సన్మానిస్తున్న వాటర్‌బోర్డు ఈడీ

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు డైరెక్టర్ స్వామి ఉద్యోగ విరమణ పొందారు. వాటర్‌బోర్డులో శివారు ప్రాంతాల ఆపరేషన్ మెయింటెనెన్స్ విభాగానికి డైరెక్టర్‌గా కొనసాగుతున్న స్వామి నగర వాసుల దాహార్తి తీర్చే పలు ప్రాజెక్టు పనుల్లో వివిధ స్థాయిల్లో తన సేవలను అందించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన స్వామిని ఈడీ మయాంక్ మిట్టల్ ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలను చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, అధికారులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ పోలీసుల కార్డన్ సెర్చ్

- 3.4 కేజీల గంజాయి పట్టివేత

హైదరాబాద్ సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఫతేనగర్‌లో ఎక్సైజ్ పోలీసులు నాలుగు టీమ్‌లు ఏర్పడి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టీమ్‌లీడర్ ప్రదీప్‌రావు పర్యవేక్షణలో సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజు, చంద్రశేఖర్, భిక్షారెడ్డి ఆధ్వర్యంలో ఫతేనగర్‌లోని పలు కాలనీలు, అనుమానాస్పద ఇళ్లలో సోదాలు చేశారు. మరో వైపు అమీర్‌పేట, శంషాబాద్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎస్‌టీఎఫ్ టీమ్ అంజిరెడ్డి బృందం ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 3.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరికి చెందిన అల్లాడి సాయి, నిజామాబాద్‌కు చెందిన నవీన్‌కుమార్‌లు అమీర్‌పేట పరిధిలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి పట్టుకున్నారు. వారి వద్ద 1.3 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రికి చెందిన సంపత్ పరారీలో ఉన్నాడు. మరో కేసులో శంషాబాద్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో గంజాయి అమ్ముతున్న దూల్‌పేట జుమ్మేరాత్ బజార్‌కు చెందిన చందన నవీన్‌కుమార్‌ను పట్టుకుని 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# రైస్ పుల్లింగ్ యంత్రం పేరుతో భారీ మోసం

పంజాగుట్ట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ యంత్రం పెట్టుకుంటే అధిక లాభాలు వస్తాయని రియల్ ఎస్టేట్ వ్యాపారిని నమ్మించి రూ.24 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన వెంకటరమణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. నవంబర్ నెలలో అతని కార్యాలయానికి పబ్బతి వెంకటేశ్వర్లు వచ్చి తన వద్ద రైస్ పుల్లింగ్ యంత్రం ఉందని, దానిని కార్యాలయంలో ఉంచితే వ్యాపారం వృద్ధి చెందుతుందని చెప్పాడు. అతని మాటలు నమ్మిన వెంకటరమణ ఆన్‌లైన్‌లో రూ.24 లక్షలు పంపించాడు. వెంకటరమణ యంత్రాన్ని తన కార్యాలయంలో పెట్టుకోగా వెంకటేశ్వర్లు చెప్పినట్టుగా ఎలాంటి లాభాలు రాలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రమేష్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి అండగా నిలిచిన ఎమ్మెల్యే

ఖైరతాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యువకుడికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అండగా నిలిచారు. రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ స్టేజీలో ఉన్న ఖైరతాబాద్ గాంధీనగర్‌కు చెందిన రమేష్ (25) గురించి తెలుసుకున్న ఆయన ప్రభుత్వం ద్వారా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సకు నిధులు కేటాయించేలా చేశారు. ఈ మేరకు శనివారం కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. దీంతో పాటు ఎమ్మెల్యే దానం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో స్వయంగా మాట్లాడి మెరుగైన చికిత్స చేయాలని సూచించారు. తమ కుమారుడి ఆరోగ్యం కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు రమేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.




అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

## మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించండి

బోరబండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బోరబండ డివిజన్ పరిధిలోని మసీదుల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ జకీయ సుల్తానాను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. శనివారం వార్డు కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న కిరణ్మయి అలివేలు

## 'హ్యాండ్ టూ హ్యాండ్' చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ వ్యవస్థాపకురాలు కిరణ్మయి అలివేలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె చేనేతకారుల వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేతకారులతో మాట్లాడి వాటి తయారీ విధానం, ప్రత్యేకత గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. నేటి తరం యువత సైతం హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ చేనేతకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 5 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో 14 రాష్ట్రాల నుంచి 75 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## హోటల్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

పంజాగుట్ట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పంజాగుట్టలోని శాన్‌బాగ్ హోటల్‌లో శనివారం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో హోటల్‌లో ఉన్న వారు కంగారు పడ్డారు. మొదటి అంతస్తులోని కిచెన్‌లో మంటలు రాగా హోటల్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేసరికి సిబ్బంది మంటలను ఆర్పివేశారు.


మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొన్న శ్రీకిషన్ తదితరులు

## మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కాలేదు

● ఇటుక శ్రీకిషన్

సికింద్రాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు వృథా కాలేదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ హైదారబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు, కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ అన్నారు. బాలంరాయి చెక్‌పోస్టు వద్ద శనివారం జరిగిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులను జాతి ఎన్నటికీ మరువదని అన్నారు. మాదిగ అమరవీరుల త్యాగాలను చరిత్రగా అందిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సంపూర్ణంగా ఉండేలా, జాతి కోసం, సమాజ హితం కోసం మందకృష్ణ సారథ్యంలో ముందుకు కదులుతామని వెల్లడించారు. మంద మధుకర్, బీ.నరసింహ, బాబిందర్, ప్రవీణ్, మధు, గిరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎస్‌సీఆర్‌పీఎస్ నాయకులు

### బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో

పద్మారావునగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులను స్మరిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మాచర్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబుజగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద మాదిగ లమరవీరుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం వారి త్యాగం మరువలేనిదని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నగర ఉపాధ్యక్షులు కుర్మ మహేందర్,ఎమ్మార్పీఎస్ నాయకులు టీవీ వాసు, విజయశంకర్, త్రిశూల్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


వారాసిగూడ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఐదు రూపాయల భోజనం డబ్బా వద్ద చెత్తాచెదారం

## ప్రమాదకరంగా అన్నపూర్ణ భోజనం డబ్బా

● రాత్రిళ్లు చెత్తవేస్తున్న స్థానికులు

బౌద్ధనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ, హరేరామహరేకృష్ణ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వారాసిగూడ ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన అన్నపూర్ణ క్యాంటిన్ డబ్బా ప్రమాదకరంగా మారింది. ఈ డబ్బా రోడ్డుమీదకు రావటంతో పాటు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిళ్లు, తెల్లవారుజామున డబ్బా వద్ద భారీగా చెత్తను పారబోస్తున్నారు. దీంతో ఈ డబ్బా వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. చెత్తవేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రయత్నించిన అది సాధ్యపడటం లేదు. మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు డబ్బా వద్ద దుర్వాసన వస్తుందని భోజనం చేసేవారు వాపోతున్నారు. ఈ డబ్బా ఉండటం వలనే చెత్తను వేస్తున్నారని కొంతమంది వాపోతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, పలుమార్లు ప్రమాదాలు జరిగాయని భోజన డబ్బాను మరోచోటకి తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదిఏమైనా అన్నపూర్ణ క్యాంటిన్ డబ్బా వద్ద చెత్తవేయకుండా తగిన చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



పదవీ విరమణ పొందిన ట్రాఫిక్ ఎస్సైలకు సన్మానం చేసిన ఏసీపీ శంకర్ రాజు

## పోలీస్ వృత్తి బాధ్యతను గుర్తు చేస్తుంది

● ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

అడ్డగుట్ట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వృత్తిని ప్రతిరోజు బాధ్యతను గుర్తు చేస్తుందని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. గోపాలపురం, బోయిన్‌పల్లి, బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న సర్దార్, రమణ, సత్యనారాయణలు పదవీ విరమణ సందర్భంగా శనివారం ఏసీపీ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీస్ వృత్తిలో పనిచేస్తూ ఒక వైపు కుటుంబాన్ని మరో వైపు ప్రజల రక్షణకోసం పనిచేస్తున్నారని, శేష జీవితం సంతోషంగా గడపాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. వీరికి కానిస్టేబుళ్లు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో గుర్తుతెలియని 30 ఏళ్ల వ్యక్తి శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని ప్రయాణికుడు అనారోగ్యంతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబరు 1లో గుర్తుతెలియని 55 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

డీఈ గోపాలరావు

బోయిన్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో రెప్పపాటు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టారు బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ అధికారులు. ఈ మేరకు అవసరమైన అన్ని చర్యలూ ప్రారంభించారు. సిబ్బందితో అధికారులతో డీఈ గోపాలరావు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరాటంకంగా సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. వేసవి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా లైన్‌మెన్లతో మొదలుకొని జేఎల్‌ఎం (జూనియర్ లైన్‌మెన్), లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజినీర్లు, ఏఈ, ఏడీఈ వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. చిన్న సమస్య అయిన వెంటనే పరిష్కరించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహించొద్దని


న్యూసిటీ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారులు

సమావేశంలో సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. సమస్య సేకరించడానికి ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటుచేసి 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చి, దీనికోసం కొత్త మొబైల్ నంబర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేసవిని అధిగమించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5.2 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మార్చి నుంచి పీక్ డిమాండ్ ఉంటుందని, అందుకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడానికి కావాల్సిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పీక్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్ల పరిధిలో ఓవర్‌లోడ్ సమస్యలను పరిష్కరించాలని, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను బలోపేతం చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఒకవేళ ఈదురు గాలుల వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఈఆర్‌టీ (ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్) వాహనాలను వాడుకొని సమస్యను అధిగమిస్తామని తెలిపారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1912కి ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు డీఈ గోపాల్‌రావు విజ్ఞప్తి చేశారు.

**కొత్తగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు..**

| | |
|---|---|
| బోయిన్‌పల్లి | 94906 19738 |
| ఫిరోజ్‌గూడ | 94906 19740 |
| ఐడీపీఎల్ | 94906 19744 |
| బాలానగర్ | 94906 19742 |
| ఆర్‌ఆర్ నగర్ | 94906 19746 |
| సీబీడీ | 94408 12910 |

### ప్రజలు సహకారించాలి



వేసవికాంలో విద్యుత్ వినియోగం ఎక్కువగానే ఉంటుంది. ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ప్రమాదం సంభవిస్తే నీరు పోయకూడదు. వీలైతే ముందుగా ఇంట్లో ఉండే మెయిన్ ఆపివేయాలి. సరఫరాకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తున్న సమయంలో ప్రజలు సిబ్బందికి, అధికారులకు సహకరించాలి. విద్యుత్ ప్రమాదాలకు ప్రధానకారణాలు, నివారణ పద్ధతులను తెలుసుకోవడం ద్వారా మనం మనల్ని సురక్షితంగా ఉంచుకోవడమే కాకుండా మన చుట్టూ ఉన్న వారిని, మన ఇంటిని, కార్యాలయాన్ని కూడా సురక్షితంగా ఉంచుకోవచ్చు.

-డీఈ గోపాలరావు

# నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

● మసీదుల వద్ద అస్తవ్యస్తంగా రోడ్లు
● రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి


మహ్మద్‌గూడ ప్రధానరోడ్డు పక్కన అస్తవ్యస్థంగా ఉన్న మట్టికుప్పలు

బౌద్ధనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ పలు ప్రాంతాల్లో మసీదుల వద్ద పరిసరప్రాంతాలు, రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆదివారం నుంచి రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభమై, నెలరోజుల పాటు జరగనున్నాయి. తమ ప్రాంతంలో మసీదుల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, రోడ్లను తవ్వివేశారని, వాటికి మరమ్మతులు చేపట్టాలని ముస్లిం మతపెద్దలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా వారు


సమి మసీద్ ముందు తవ్వివేసిన రోడ్డు

పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. మహ్మద్‌గూడ ప్రధాన రహదారిని ఆనుకుని సమి మసీదు, పుల్లయ్యబావి వద్ద మరో మసీదు ఉన్నాయి. రంజాన్‌దీక్షలకు ఈ మసీదులకు వందలామంది ముస్లింలు వచ్చి ఉదయం, సాయంత్రం ప్రార్థనలు చేస్తుంటారు. ప్రసుత్తం ఈ మసీదుల ముందు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. సమి మసీదు ముందు నుంచి నిత్యం మురికినీరు పారుతుండటంతో ఇటీవల మరమ్మతుల పేరుతో రోడ్లను తవ్వివేయటంతో కంకర తేలి, ప్రమాదకరంగా మారింది. మరోవైపు రోడ్డుపక్కన ఉన్న మట్టికుప్పలను తొలగించలేదు. పుల్లయ్యబావి వద్ద నున్న మసీదు ముందు రోడ్లను తవ్వివేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మసీదుల ముందు ఫ్రూట్స్‌బండ్లు, తినుబండారాల షాపులు పెడతారని, ఉపవాసదీక్ష ముగిసిన తర్వాత ఏమైనా పండ్లు కొనుగోలు చేయాలంటే అస్తవ్యస్తంగా ఉన్నరోడ్ల నుంచి దుర్వాసన వస్తుందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మసీదుల ముందు తవ్వివేసిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఫంక్షన్ హాల్‌కు స్థలం కేటాయించాలి: శ్రీగణేష్


సీఈఓ మధుకర్ నాయక్‌తో మాట్లాడుతున్న శ్రీగణేష్

సికింద్రాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పేద, బలహీనవర్గాల ప్రజల కోసం మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ అవసరం ఉందని, దీని కోసం తగిన స్థలం కేటాయించాలని కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి మధుకర్ నాయక్‌కు ఎమ్మెల్యే శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు. శనివారం మధుకర్ నాయక్‌తో సమావేశమైన శ్రీగణేష్ పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ గురించి మాట్లాడారు. ఖరీదైన ఫంక్షన్ హాళ్లకు వెళ్లే స్తోమత పేదలకు లేదని, అందుకే మంచి ఫంక్షన్ హాల్ నిర్మించాలని తాము యోచిస్తున్నామని చెప్పారు. బొల్లారంలోని అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంతంలో సీవరేజీ సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.


పోస్టాఫీస్ వద్ద కార్డులతో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ సభ్యులు

## ఎన్నికల హామీలను వెంటనే ప్రకటించాలి

● తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్

బౌద్ధనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం వారాసిగూడ పోస్టాఫీస్ వద్ద పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ కన్వీనర్ గుండు దయానంద్, ప్రధాన కార్యదర్శి జగన్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రమేష్, నాయకురాళ్లు ఎర్రజ్యోతి, గగనకుమారి, విజయ తదితరులు పాల్గొన్నారు.


ఊర్మిళకు కంటి అద్దాలు అందజేసిన బీఆర్‌ఎస్ నాయకులు

## ఉచితంగా కంటి పరీక్షలు

తిరుమలగిరి మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వార్డ్-7 కు చెందిన కంటి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు ఆపరేషన్ చేయించి మందులు, కళ్ల అద్దాలు అందజేస్తామని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగానే తిరుమలగిరి విలేజ్ పోచమ్మ టెంపుల్ సమీపంలో ఉన్న ఊర్మిళకు శనివారం కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో శ్యామ్‌కుమార్ సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించారు. కళ్ల అద్దాలు, మందులను లాల్‌బజార్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో అందజేశారు.

## చైన్‌స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

రాజేంద్రనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచింగ్ కేసులో అత్తాపూర్ పోలీసులు శనివారం ముగ్గురిని అరెస్ట్ చేశారు. వివరాలను రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ వెల్లడించారు. ఫిబ్రవరి 25వ తేదీన అన్నపూర్ణ(50) సర్వారెడ్డికాలనీలో నివాసం ఉండే కూతురు దగ్గరకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వెళ్తూ ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. అన్నపూర్ణ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, డీఐ కె.రవి విచారణ చేశారు. ఈ నేరానికి పాల్పడింది పాత నేరస్థులు చాంద్రాయణగుట్ట బండ్లగూడలో ఉండే మహారాష్ట్ర నివాసి మీర్ ముస్తఫా అలీ అలియాస్ అలీ(43), రాజేంద్రనగర్ నౌనెంబర్ జలాల్ బాబానగర్ ప్రాంతంలో ఉండే ఉత్తర్‌ప్రదేశ్‌వాసి షేక్ ఖయ్యూం(38) అని గుర్తించారు. ఇప్పటికే వీరిపై 80 వరకు కేసులు ఉన్నాయి.

# వీనుల విందుగా రామదాసు కీర్తనల గోష్టి


గోష్టి గానంలో విద్యార్థులు, లెక్చరర్లు

చిలకలగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలలో వాగ్గేయకారుడు రామదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహావాది సరిత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడుతు రామదాసు అపార శ్రీరామభక్తుడని, ఆయన కృతి చేసిన కీర్తనలు నేటికి నిత్యనూతనంగా ప్రజల నాలుకల్లో పలుకుతాన్నాయని, భద్రాచలంలో ఆలయ నిర్మాణానికి ఆయన పడిన కష్టాలు, జైలు జీవితం వివరించారు. అనంతరం కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు రామదాసు నవరత్న కీర్తనలు రాగ, భావ యుక్తంగా గోష్టి గానం గావించారు. కార్యక్రమంలో లెక్చరర్లు శారద, అనిల్ విద్యార్థులు సునీత, శివకుమారి, కల్పన, స్వరూప, శ్లోకా తదితరులు పాల్గొన్నారు. కళాశాలకి ఆయన పేరు పెట్టినందుకు రామదాసుని స్మరించుకుంటు ఆయన జయంతి ఘనంగా నిర్వహించారు.

## తల్లి, కొడుకు అదృశ్యం


అక్షిత కొఠారి, తనిష్క్ కొఠారి

బోయిన్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భార్యా భర్త గొడవతో కౌన్సెలింగ్‌కు వెళ్లిన ఓ మహిళ తన కుమారుడు అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నికేత్ కొఠారి, అతని భార్య అక్షిత కొఠారి(30) మారేడుపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరికి తనిష్క్ కొఠారి(2) బాబు ఉన్నాడు. కొంతకాలంగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో గొడవ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఈ క్రమంలో వీరిద్దరూ కౌన్సెలింగ్ కోసం శుక్రవారం బోయిన్‌పల్లి కౌన్సిలింగ్ సెంటర్‌కు వచ్చారు. అనంతరం తాను సికింద్రాబాద్‌లోని బజార్‌కు వెళ్లివస్తానని భర్తకు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. భార్య, తన కుమారుడు శనివారం వరకు ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తెలిసినవారిని, బంధువులను ఆరాతీసినా ఫలితం లేకుండా పోయింది. తన భార్య, కుమారుడు కనిపించడంలేదని బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తల్లీ కొడుకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కొబ్బరి బొండాల వ్యాపారి ...


వీర వెంకట సత్యనారాయణ

బోయిన్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునే ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి మల్లికార్జునకాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన వీర వెంకట సత్యనారాయణ(45) భార్య సత్యవేణి కొన్ని సంవత్సరాలుగా ఓల్డ్ బోయిన్‌పల్లి శ్రీనివాస్ నర్సింగ్ హోమ్ వద్ద కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బులు విషయంలో భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతనెల 15న తన సొంత ఊరికి వెళ్తున్నాని చెప్పి టీఎస్ 08 జెడి 4901 యాక్టీవ పైన ఇంటి నుంచి వెళ్లాడు. ఆనాటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. సొంత ఊరికి వెళ్లలేదు. దీంతో అనుమానం వచ్చిన భార్య శనివారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కొంపల్లిలో తైబజారు వేలం

పేట్‌బషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో తైబజారును నిర్వహించనున్నట్లు కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తైబజారుకు బహిరంగ వేలంలో పాల్గొనే వారు పురపాలకసంఘం కార్యాలయంలో లక్ష రూపాయల ధరావత్తు చెల్లించి, లక్ష రూపాయలు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో ఈ నెల 11న నిర్వహించే వేలంలో పాల్గొనాలని తెలిపారు.

## హిందీని దక్షిణాది రాష్ట్రాలపై రుద్దితే సహించేదిలేదు

● ప్రొ. గాలి వినోద్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్

తార్నాక, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో ఉత్తరాది భాష అయిన హిందీ భాషను దక్షిణాది రాష్ట్రాలపై బలవంతంగా రుద్దితే సహించేదిలేదని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ అన్నారు. శనివారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జనాభా ధామాషా పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయిస్తూ దక్షిణాది ప్రాంతాలకు తీవ్ర ద్రోహం చేస్తుందని మండిపడ్డారు. 2026లో జరిగే డిలిమిటేషన్ ద్వారా 130 ఎంపీ స్థానాల్లో 30 కోల్పోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా దక్షిణాది ప్రాంతవాసులు మేల్కొకపోతే మన అస్థిత్వంతో పాటు, హక్కులు, ఆత్మగౌరవాన్ని కూడా కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో దక్షిణాది జేఏసీ కో-చైర్మన్ నకిరేకంటి సంజీవరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# తాగి రోడ్ల మీద దొర్లడం... మత్తు దిగాక వెళ్లడం

● మద్యం ప్రియుల ఆగడాలతో పోలీసులు, 108 సిబ్బంది సమయం వృథా


మద్యం మత్తులో పడి గాయలపాలైన వ్యక్తికి వైద్యం చేస్తున్న 108 సిబ్బంది, పోలీసులు

రెజిమెంటల్‌బజార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఫుల్‌గా మందు కొట్టడం, సోయి లేకుండా రోడ్డు పైన పడుకోవడం... మత్తు దిగాక లేచిపోవడం ఇది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఈ దృశ్యాలు నిత్యం కనిపిస్తాయి. ఎక్కువగా ఏ లక్ష్యం లేకుండా జులాయిగా తిరుగుతూ మద్యం మత్తులో జోగుతుంటారు. చెత్త పేపర్‌లు, వాటర్ బాటిళ్లను సేకరించడం అవి అమ్మగా వచ్చిన డబ్బులతో మద్యం కొనుక్కొని తాగుతుంటారు. తాగిన మత్తులో రోడ్డులో పడుకోవడంతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు తాగుబోతుల వల్ల పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది విలువైన సమయం వృథా అవుతోంది. తాగి రోడ్లపై పడుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడితే పోలీసులకు, గాయలైతే 108 అంబులెన్స్‌కు సమాచారం అందిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది ముందగా మత్తు దిగిపోయేలా స్పిరిట్ ముక్కు దగ్గర పెట్టడం సాధారణ స్థితికి రాగానే వివరాలు సేకరించి వదిలివేస్తుంటారు. ఒకవేళ గాయాలై రక్తం కారుతుంటే సాధారణ గాయాలైతే 108 సిబ్బంది కట్టుకట్టి వెళ్తారు. ఒకవేళ గాయం పెద్దదై కుట్లు అవసరం అనుకుంటే గాంధీ ఆస్పత్రికి తరలిస్తారు. ఇక్కడ మరో సమస్య ఏంటంటే మద్యం మత్తులో ఉన్న వారు కట్టుకడితే పీకేసుకుంటుంటారు. అప్పుడు 108 సిబ్బందికి తలనొప్పిగా మారుతుంది. వదిలేసి వెళ్లలేరు. సమయం కేటాయించి స్పిరిట్‌తో మత్తు ఒదిలించి వైద్యం చేయాల్సిన దుస్థితి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్న వైన్‌షాపుల యాజమానులకు అవగాహన కల్పించి, జులాయిగా తిరుగుతూ మద్యం మత్తులోనే మళ్లీ మద్యం కొనడానికి వచ్చే వారికి మద్యం విక్రయించకుండా పోలీసులు చర్యలు తీకోవాలి. దీంతో కొంత వరకు ఈ సమస్యకు ఉపశమనం లభిస్తుంది.